సమస్యలపై ప్రజావాణిలో వినతి పత్రం అందజేత



జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్

మైలార్‌దేవ్‌పల్లి: జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్ కాలనీలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మార్కండేయనగర్ కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు డ్రైనేజీ, మ్యాన్‌హోల్స్ పగిలిపోవడం, సీసీ రోడ్లు గుంతలమయంగా కావడం, స్ట్రీట్ లైట్లు వెలగకపోవడం వంటి సమస్యలతో ప్రతి నిత్యం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాండు, నరసింహ, రత్నమ్మ, లలిత, విజయలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



మైలార్‌దేవ్‌పల్లి: మధుబన్‌కాలనీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఇద్దరు ఉపాధ్యాయులకు సోమవారం స్థానికులు సన్మానం చేసి వీడ్కోలు పలికారు. గత 12 సంవత్సరాల నుంచి శ్రీనివాస్‌రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉన్నారు. వీరితో పాటు సువర్ణ, క్రిష్ణ ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపడంతో వీరిని స్థానికులు అభినందించి సన్మానించారు. వీరి స్థానంలో ప్రధానోపాధ్యాయులుగా సంగీత, ఉపాధ్యాయులు వెంకటేష్, ఆంజనేయులు వచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అంకిత భావంతో విద్యను బోధించామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు వజ్రమ్మ, స్వరూపా రాణి తదితరులు పాల్గొన్నారు.

పనితీరు ప్రజల్లో గుర్తింపు తెస్తుంది



శ్రీధర్‌గౌడ్‌ను సన్మానించిన కమిషనర్, సిబ్బంది

మణికొండ: ప్రభుత్వ అధికారులుగా మనం చేసే పనితీరు ప్రజల్లో గుర్తింపు తేవటంతో పాటు ఎల్లప్పుడు గుర్తుంచుకునేలా చేస్తుందని నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్‌గౌడ్ సోమవారం పదవీ విరమణ పొందటంతో ఆయనను ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఎలాంటి వివాదాలు లేకుండా అందరిని కలుపుకుని పనిచేసి శ్రీధర్‌గౌడ్ గుర్తింపు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో టీపీఓ మణిహారిక, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు విస్తృతంగా మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

శంషాబాద్: విద్యార్థులు విస్తృతంగా మొక్కలు నాటాలని తెలంగాణ సామాజిక స్టూడెంట్స్ ఆర్గనైజేషన్స్ అధ్యక్షుడు లక్ష్మీనివాస్ అన్నారు. టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పెద్ద ఎత్తున మొక్కలను నాటారు. కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర నాయకులు ప్రవీణ్, సుధాకర్, ప్రకాష్, శ్వేత, మహేశ్వరి, రూపాలి సింగ్, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను మెరుగుపర్చండి



జలమండలి అధికారులను కలిసిన వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: పాత పైప్‌లైన్లతో నీటి సరఫరా జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పైప్‌లైన్లను ఆధునీకరించి నీటి సరఫరాను మెరుగుపరచాలని మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి జలమండలి అధికారులను కోరారు. సోమవారం జలమండలి జీఎం మహేందర్‌నాయక్, డీజీఎం మహేష్‌ను కలిసి మణికొండ గ్రామంలో ఎదురవుతున్న నీటి సమస్యను వారికి వివరించారు. పాత పైప్‌లైన్లు పాడైపోవటంతో స్థానికులు నానాఅగచాట్లు పడుతున్నారని, కొత్త పైప్‌లైన్లు వేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికాంత్‌రెడ్డి, రాఘవ రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

రాజేంద్రనగర్: వేగంగా దూసుకొచ్చిన ఓ కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి వెళ్లిపోయిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. శంషాబాద్ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ (30) నగరంలోని డీటీడీసీ కొరియర్‌లో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై సొడమ్మ గుట్ట హిమాయత్‌సాగర్ మీదుగా కార్యాలయానికి వెళ్తుండగా వెనుక నుంచి కారు వేగంగా దూసుకొచ్చి ఢీకొంది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు గాయాలుకాగా, స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

‘తెల్లాపూర్’లో ఎన్ఎస్ఎస్

- మొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా ప్రయత్నం
- పరిశుభ్రత, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలు

దత్తత తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టిన హెచ్‌సీయూ వాలంటీర్లు



తెల్లాపూర్‌లో శుభ్రతా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

రాయదుర్గం: ఆరోగ్యకరమైన, శుభ్రతతో కూడిన ఆహ్లాదకర వాతావరణం అవసరమంటూ హెచ్‌సీయూ నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) యూనిట్ పలు కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా హెచ్‌సీయూ చెంతనే ఉండే తెల్లాపూర్‌ను దత్తత తీసుకొంది. ‘స్వచ్ఛతా హీ సేవా’ కార్యక్రమం పేరిట హెచ్‌సీయూలోని అన్ని విభాగాలు, హార్టికల్చర్, పారిశుద్ధ్య విభాగం, విద్యార్థులు, ఫ్యాకల్టీతో కలిసి స్వచ్ఛభారత్, ‘ఏక్ పేడ్ మా కే నామ్’పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. దత్తత తీసుకున్న తెల్లాపూర్‌లో మాత్రం సేవా కార్యక్రమాలు కొనసాగించాలని నిర్ణయించారు. తెల్లాపూర్‌లో స్వచ్ఛభారత్, సంస్కార్ స్వచ్ఛతా -2024 పేరిట శుభ్రమైన వాతావరణం నెలకొనేలా ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పనులను చేపట్టనున్నారు. అంతేకాకుండా శ్రమదానం, ఏక్ పేడ్ మా కే నామ్ పేరిట మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పరిసరాల్లో శుభ్రమైన వాతావరణం నెలకొల్పడం, వ్యర్థాలు, చెత్తాచెదారం, పిచ్చిమొక్కల తొలగింపు కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 50 పండ్ల మొక్కలు ముఖ్యంగా మామిడి, జామ, అల్లనేరేడు, వేప, దానిమ్మ, రావి తదితర మొక్కలను విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నాటారు.

అవగాహన కార్యక్రమాలు..

తెల్లాపూర్‌లో హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా గ్రామంలో ఇళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థల పరిసరాల్లో శుభ్రత ,వ్యక్తిగత ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అవగాహన కల్పించనున్నారు. ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించాలని నిర్ణయించారు.అలాగే ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, బాటిళ్ల వాడకుండా అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తెల్లాపూర్‌లో ప్రజల సామాజిక, ఆర్థిక, జీవన స్థితిగతులపై ప్రత్యేక సర్వే నిర్వహించి నివేదిక రూపొందించాలని హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్ణయించింది. ఈ ప్రాంతాన్ని కొన్ని భాగాలుగా విభజించి ఆర్థిక, జీవన స్థితిగతులపై ప్రత్యేక సర్వే చేయనున్నారు. ఈ నివేదికను తెల్లాపూర్ పాలక మండలికి అందజేస్తారు.



తెల్లాపూర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న డా. కృష్ణయ్య, విద్యార్థులు



తెల్లాపూర్‌లో క్లీనప్ డ్రైవ్‌లో పాల్గొన్న హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ విద్యార్థులు

తెల్లాపూర్‌పై ప్రత్యేక నివేదిక రూపొందిస్తాం



గాంధీ జయంతి తర్వాత కూడా తెల్లాపూర్‌లో స్వచ్ఛతా కార్యక్రమం కొనసాగుతుంది. అలాగే వైద్య శిబిరం నిర్వహణ, సర్వే, అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. తెల్లాపూర్‌పై ప్రత్యేక నివేదిక రూపొందిస్తాం. హెచ్‌సీయూ క్యాంపస్‌తో బాటు చేరువలోని ప్రాంతాలలోనూ ఇలాంటి పరిస్థితులు నెలకొనేలా చేస్తాం. అందుకే తెల్లాపూర్‌ను దత్తత తీసుకున్నాం. స్థానిక ప్రజలు నాయకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు సహకరిస్తున్నారు.

-డా. కృష్ణయ్య, హెచ్‌సీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్

ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

రాజేంద్రనగర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ సర్కిల్ ఉప కమిషనర్ రవి కుమార్ సూచించారు. సోమవారం రాజేంద్రనగర్‌లోని సర్కిల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రవి కుమార్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో తమకు అందిన ఫిర్యాదులను సంబంధిత విభాగాలతో పరిష్కరిస్తున్నామన్నారు. బస్తీ, కాలనీవాసులు, స్థానికంగా నెలకొన్న సమస్యలపై ఫిర్యాదు చేయాలని సూచించారు. అందిన ఫిర్యాదులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీ రవి కుమార్

కొనసాగుతున్న మూసీ రివర్ బెడ్ బాధితుల తరలింపు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ రెవెన్యూ మండల పరిధిలోని మూసీ రివర్ బెడ్ బాధితుల తరలింపు ప్రక్రియ కొనసాగుతోంది. రాజేంద్రనగర్, గండిపేట్ మండల పరిధిలో మొత్తం 339 నిర్మాణాలను అధికారులు గుర్తించారు. వీరిలో 22 కుటుంబాలు శనివారం నార్సింగితో పాటు జియగూడలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు తరలివెళ్లారు. సోమవారం మరో రెండు కుటుంబాలు జియగూడ ప్రాంతానికి వెళ్లడంతో అధికారులు వారికి పట్టాలు అందించి, ఇంటి తాళాలను అందజేశారు. స్వచ్ఛందంగా ముందుకు వస్తున్న వారికి తాము నార్సింగి, జియగూడ ప్రాంతాల్లోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను చూపిస్తున్నామని, వారి కోరిక మేరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

సత్ప్రవర్తనను అనుసరించాలి

బండ్లగూడ: అల్లా బోధనల ప్రకారం ప్రతి ఒక్కరు సత్ప్రవర్తనను అనుసరించాలని ‘సీరత్ ఉన్ నబీ’ సమావేశంలో వక్త బుబాషీర్ అహ్మద్ సాహెబ్ అన్నారు. సోమవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్‌సిటీలో జమాతే ఇస్లామీ హింద్, రబీ ఉల్ అవ్వల్ సందర్భంగా ముస్లింలు ఓ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వక్తగా హాజరైన ఆయన సృష్టి సేవ, మహిళల హక్కుల గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో అబ్దుల్ రఫీ, మహమ్మద్ ఖాలీద్ తదితరులు పాల్గొన్నారు.



గండిపేట మండల విద్యాధికారిగా విజయ్‌కుమార్



మణికొండ: గండిపేట మండల విద్యాధికారిగా నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విజయ్‌కుమార్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలోని ప్రతి మండలానికి ఓ విద్యాధికారిని నియమించాలనే ఆలోచనతో ఇప్పటి వరకు రాజేంద్రనగర్, గండిపేట, శంషాబాద్ మండలాలకు కలిపి ఒకరే ఉన్న వ్యవస్థను మార్చి మూడు మండలాలకు ముగ్గురు అధికారులను నియమించింది. అందులో భాగంగా గండిపేట మండలానికి విజయ్‌కుమార్‌ను నియమించింది. మండల విద్యాధికారిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆయన తన కార్యాలయాన్ని త్వరలోనే కిస్మత్‌పూర్‌లో ప్రారంభిస్తామని, మండలంలో విద్యావ్యవస్థ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

స్వలాభం కోసమే కాంగ్రెస్ గూటిలోకి ప్రకాష్‌గౌడ్

అత్తాపూర్: ప్రజాభిప్రాయాన్ని తుంగలో తొక్కిన ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాఘవేందర్ యాదవ్, గుమ్మడి కుమార్ అన్నారు. మూసీ నది పరీవాహక నిర్వాసితుల కార్యక్రమంలో భాగంగా లక్ష్మీనగర్ పార్కులో మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం అంటూ ఎప్పటికప్పుడు ఏ ఎండకు ఆ గొడుగు పడుతున్న ప్రకాష్‌గౌడ్ తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎన్నికలు ఎప్పుడు ఎక్కడ వచ్చిన బీఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధిస్తారని ఈ సందర్భంగా తెలిపారు. ప్రకాష్‌గౌడ్ ఎమ్మెల్యేగా రాజేంద్రనగర్ నియోజకవర్గానికి చేసింది ఏమి లేదన్నారు. తన ఆస్తులను కాపాడుకునేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరారని మండిపడ్డారు. స్వార్థ రాజకీయాలకు పాల్పడుతున్న వారిని ప్రజలు ఓటుతో బుద్ధి చెబుతారని వారు పేర్కొన్నారు.

అమెజాన్‌కు వినియోగదారుల కమిషన్ మొట్టికాయ

- ఆన్‌లైన్‌లో ఆర్డర్.. పనిచేయని ప్రొడక్ట్
- రూ. 34వేలను బాధితురాలికి చెల్లించండి
- అమెజాన్ కంపెనీని ఆదేశించిన రంగారెడ్డి జిల్లా కమిషన్

సిటీ కోర్టులు : కస్టమర్ ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన ప్రొడక్ట్ పనిచేయకపోవడం ఖచ్చితంగా అమెజాన్ సంస్థ సేవా లోపమేనని రంగారెడ్డి జిల్లా వినియోగదారుల కమిషన్ మెంబర్ శ్యామల పేర్కొన్నారు. కస్టమర్స్ ఎంతో ఆశతో వస్తువులు కొనుగోలు చేస్తుంటారు. అనంతరం వారికి ఏదైన సమస్య ఎదురైనప్పుడు కస్టమర్ కేర్‌ను లేదా సంస్థను సంప్రదిస్తారు. వీరి ఇద్దరిలో ఎవరూ స్పందించకపోతే వారి సమస్య ఎలా పరిష్కారం అవుతుందని అమెజాన్ సంస్థపై మండిపడ్డారు. పిటిషనర్ ప్రొడక్ట్ కోసం చెల్లించిన రూ.24 వేలు, నష్టపరిహారంగా రూ.5 వేలు, కోర్టు ఖర్చులకు మరో రూ.5 వేలను మొత్తం కలిపి 9 శాతం వడ్డీతో 45 రోజుల్లోపు బాధితురాలికి అందజేయాలని కంపెనీని ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. గండిపేట్, కిస్మత్‌పూర్‌కు చెందిన గీత సెప్టెంబర్, 2022లో అమెజాన్‌లో 360 ఎస్-9 అల్ట్రాసోనిక్ లిడార్ రోబోట్ వాక్యూమ్ క్లీనర్ మరియు మాప్ లేజర్ నావిగేషన్, రూమ్ క్లీనింగ్ షెడ్యూల్ మరియు సెల్ఫ్ ఛార్జ్‌తో కూడిన అలెక్సాను రూ. 24వేలు పెట్టి ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసింది. అయితే ప్రొడక్ట్ డెలివరీ అయినప్పటి నుంచి పనిచేయకపోవడమే కాకుండా ఛార్జింగ్ కూడా కావడంలేదు. దీంతో పిటిషనర్ ఎన్నిసార్లు కస్టమర్ కేర్‌ను సంప్రదించినా పట్టించుకోలేదు. చివరకు అమెజాన్ కంపెనీకి మెయిల్ చేసినా ఎలాంటి స్పందన లేకపోవడంతో పిటిషనర్ రంగారెడ్డి వినియోగదారుల కమిషన్‌ను సంప్రదించి పిటిషన్ దాఖలు చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని ఆమె పిటిషన్‌లో క్లుప్తంగా వివరించారు. దీనిపై రంగారెడ్డి వినియోగదారుల కమిషన్ అధ్యక్షురాలు లతాకుమారి, మెంబర్ శ్యామలతో కూడిన బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ ప్రొడక్ట్ కోసం చెల్లించిన డబ్బుతో పాటు నష్టపరిహారాన్ని కూడా చెల్లించాలని ఇటీవల అమెజాన్ కంపెనీని ఆదేశిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది.

ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేయాలి



ఉద్యోగ విరమణ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది

ఏజీవర్సిటీ: ప్రతి ఒక్కరు తాము చేసే సంస్థ అభివృద్ధి కోసం అంకిత భావంతో పనిచేయాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి మల్లేష్ నేడు పదవీ విరమణ పొందాడు. ఈ కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగిని ఘనంగా సన్మానించారు. ప్రతి ఒక్కరు తమ వృత్తిలో, వ్యక్తిగత జీవితంలో ఎదురైయే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం అధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నార్మ్ ఉద్యోగి పదవీ విరమణ...

రాజేంద్రనగర్‌లోని నార్మ్ (నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజిమెంట్)లో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్‌రావు సోమవారం పదవీ విరమణ పొందాడు. ఈ సందర్భంగా నార్మ్ అధికారులు అతని ఘనంగా సన్మానించారు. నార్మ్‌లో 40 సంవత్సరాలుగా విధులు నిర్వహించి నేడు పదవీ విరమణ పొందుతున్న నర్సింగ్‌రావు సేవలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది ఆయన్ని ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.



నార్మ్‌లో పదవీ విరమణ పొందిన అధికారికి వీడ్కోలు పలుకుతున్న అధికారి

ఏడీహెచ్‌డీ లక్షణాలు ప్రారంభ దశలోనే గుర్తించాలి

శంషాబాద్: పిల్లల్లో ఏడీహెచ్‌డీ (అటెన్షన్ డెఫిషియన్సీ హైపర్‌యాక్టివ్ డిసార్డర్) ప్రారంభ దశలోనే తల్లిదండ్రులు గుర్తిస్తే సరైన థెరపీల ద్వారా సాధారణ పిల్లలుగా మార్చేందుకు అవకాశముంటుందని గ్లోబల్ చైల్డ్ డెవలప్‌మెంట్ సంస్థ నిర్వాహకురాలు, చైల్డ్ సైకాలజిస్ట్ మల్లం మౌనిక సూచించారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి 100 మంది పిల్లల్లో ఇద్దరు ఆటిజం భారిన పడుతున్నారన్నారు. ప్రధానంగా టీవీ, మొబైల్‌ను అధికంగా వాడడంతో పాటు పిల్లలను ఒంటిరిగా ఉంచడం కూడా దీనికి కారణమన్నారు. 16 నెలల వరకు కూడా సాధారణంగా ఉన్న పిల్లలు 20 నెలల తర్వాత పేరుతో పలకకపోవడం, ఎవరిని చూడకుండా ఉండడం, చేసిన పనినే మళ్లీ చేయడం వంటి లక్షణాలు కనిపిస్తుంటాయి. ఈ దశలోనే సరైన వైద్యులను సంప్రదించి వారి మానసిక లక్షణాలపై అనుగుణమైన థెరపీల ద్వారా మాత్రమే బాగు చేసేందుకు అవకాశముంటుందన్నారు. తమ సంస్థ కూడా ప్రస్తుతం సంజీవ్‌రెడ్డినగర్, దిల్‌సుఖ్‌నగర్‌లో ఆటిజం ప్రత్యేక కోర్సులను నిర్వహిస్తోందన్నారు.



చైల్డ్ సైకాలజిస్ట్ మల్లం మౌనిక

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



పూజల్లో చైర్మన్ ఉపేంద్రనాథ్‌రెడ్డి దంపతులు



పూజల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి

మణికొండ: వేద పండితుల మంత్రోచ్ఛారణలు, హోమాలు, ప్రత్యేక పూజలతో వెంకటేశ్వర కాలనీ మారుమ్రోగింది. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని వెంకటేశ్వర కాలనీలో సర్వశక్తుల ఆదిదేవత, కలియుగ అమ్మవారు అయిన గాయత్రీ మాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉదయం 8గంటలకు వినాయకుడి పూజ, నాందీ పూజ, దీక్షాదారణ, అంకురార్పణ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపనతో పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం 11 గంటలకు శ్రీ గాయత్రీ దేవి, శ్రీ మహాలక్ష్మి, శ్రీ మహాసరస్వతి, మహాగణపతి, నవగ్రహాలు, క్షీరాధివాసము నిర్వహించారు. సాయంత్రం హోమాలు, మంగళహారతి, మహా మంత్రపుష్పము కార్యక్రమాలతో మొదటి రోజు పూజలు ముగిశాయి. అక్టోబరు 4వ తేదీన విగ్రహాల ప్రతిష్ఠాపన ఉంటుందని, ప్రతి రోజు జరిగే పూజల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త, చైర్మన్ ఉపేంద్రనాథ్‌రెడ్డి కోరారు. మొదటి రోజు పూజల్లో మణికొండ మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి, నాయకులు రాఘవరెడ్డి, రవికాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు అండగా ఉండాలి



చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: పేద పిల్లలు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలకు సేవా సంస్థలు, ఐటీ సంస్థలు అండగా నిలవాల్సిన అవసరం ఎంతో ఉందని మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గీతాంజలి వేదిక్ పాఠశాల ఎండీ జయకిరణ్ సీఎస్ఆర్ నిధులతో భాగంగా రూ. 1లక్షను ఆయన చేతుల మీదుగా పుప్పాలగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పనకు అటు ప్రభుత్వంతో పాటు ఇటు మున్సిపాలిటీ తమ వంతు కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల సంఖ్య పెరుగుతుండడంతో మరిన్ని సౌకర్యాలను కల్పించాల్సిన అవసరం ఉందని, అందుకు ఇలాంటి సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్, గీతాంజలి స్కూల్ ప్రిన్సిపాల్ సోనియా నాగ్పాల్, కౌన్సిలర్లు లక్ష్మీనారాయణ, పురుషోత్తం, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సుకు కృషి

బండ్లగూడ: ప్రజల శ్రేయస్సుకు అనునిత్యం కష్టపడే కార్మికుల సంక్షేమంకు తమ వంతు కృషి చేస్తామని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. సోమవారం ‘స్వభావ్ స్వచ్ఛత-సంస్కార్ స్వచ్ఛత’ అనే కార్యక్రమంలో భాగంగా కాళీ మందిర్ వద్ద ఓ ఫంక్షన్‌హాల్‌లో కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మేయర్‌తోపాటు కమిషనర్ శరత్‌చంద్ర మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు నిరంతరం మన మేలు కొరకు పనిచేస్తారని, అలాంటి వారి బాగోగులు చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మంజులత, డీఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, ఆర్ఐ శివ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి సహపంక్తి భోజనంలో మేయర్, కమిషనర్